క్లుప్తంగా

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

నర్సంపేట : ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని స్థానిక డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈనెల 2 నుంచి 14వ తేదీ వరకు స్కూళ్లకు సెలవులు ఉన్న నేపథ్యంలో ప్రయాణాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. మహిళా ప్రయాణికులు కూడా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని సూచించారు. డిపో పరిధిలోని ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు



దుగ్గొండి : మండల కేంద్రంలోని ఆదర్శవాణి విద్యాలయంలో సోమవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు బతుకమ్మలు పేర్చి పాఠశాల ఆవరణలో పాటలు పాడుతూ కోలాటం ఆడారు. ఈ సందర్భంగా విద్యాలయ చైర్మన్ నాగనబోయిన రవి మాట్లాడారు. పువ్వులను బతుకమ్మగా పేర్చి పూజించడాన్ని పండుగ ప్రత్యేకతగా అభివర్ణించారు. విద్యార్థి దశలోనే పండుగల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమం హెచ్ఎం మణికంఠ రవి, డైరెక్టర్ భిక్షపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీ

నర్సంపేట రూరల్ : నర్సంపేట పట్టణంలోని సర్వాపురం ఎస్సీ ప్రభుత్వ పాఠశాలను ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ సారయ్య, తహసీల్దార్ రాజేశ్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ సంధ్యారాణి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈనెల 28న సదరు పాఠశాలకు ఫెన్సింగ్ చేస్తుండగా కొందరు అడ్డుకున్న నేపథ్యంలో విచారణ చేపట్టారు. ప్రజల అభిప్రాయాలను సేకరించి వినతులు స్వీకరించారు. జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా కుమారస్వామి



నల్లబెల్లి : యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా కత్తి కుమారస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా పాధ్యక్షురాలు మర్రి అన్నాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా ఎడవెల్లి రాజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా కనుకుల భారతి, కొడెపాక శంకరయ్య, కోశాధికారిగా నల్లెల యాదగిరి ఎన్నికైనట్టు పేర్కొన్నారు.

'చైతన్య' క్లబ్ అధ్యక్షుడిగా..

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలోని శ్రీచైతన్య యూత్ క్లబ్ అధ్యక్షుడిగా సింగిరెడ్డి విజేందర్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా చింతల శ్రావణ్, ఉపాధ్యక్షుడిగా జంగిలి రవి, సహాయ కార్యదర్శిగా అనుముల దామోదర్, సభ్యులుగా తోట రవి, చెపూరి ప్రశాంత్, వోడపెల్లి సునీల్, బోధ బాలాజీ, గోనె మహేశ్, లింగాల శివ, బైరగోని మహేశ్, బైకని కుమార్, మురళీ, పవన్, రాజు, జంగిలి చంద్రమౌళి ఎన్నికయ్యారు.

వేదపండితుడికి సన్మానం

సంగెం : మండలంలోని చింతలపల్లికి చెందిన ప్రముఖ వేద పండితుడు, శ్రీ భవానీ శంకరాలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులును గ్రామస్తులు సోమవారం సన్మానించారు. సుదర్శనాచార్యులుకు తిరుమల తిరుపతి దేవస్థానం ఇటీవల జ్యోతిష్య శాస్త్రంతో గౌరవ డాక్టరేట్, స్వర్ణకంకణం బహూకరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సుదర్శనాచార్యులును గ్రామస్తులు గజమాల, శాలువలు, పూలమాలలతో సత్కరించారు.

ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం రాజయ్యకు..

రాయపర్తి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేసి బదిలీ అయిన ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం సింగారపు రాజయ్యను ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ నగర్ పీఎస్ హెచ్ఎం ప్రసాద్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఐత పూలమ్మ, ఉపాధ్యాయులు నవమణి, ఝాన్సీ, అంగన్‌వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన హెచ్ఎంకు..

నర్సంపేట రూరల్ : ముత్యాలమ్మతండా ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా పని చేసిన వెంకటస్వామి ఉద్యోగ విరమణ సందర్భంగా ఎంఈఓ సారయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం రమాదేవి తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకయ్య, మాజీ జిల్లా అధ్యక్షుడు గుంటి రాంచందర్, మహబూబాబాద్ జిలా అధ్యక్షుడు నెల్లుట్ల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు..

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్ నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు. అనంతరం బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ ప్రసన్న లక్ష్మి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతంగా నిలవడమే ఉపాధ్యాయులకు ఇచ్చే గౌరవమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేఖర్, రాజు, వెంకటేశ్వర్లు, వీరబాబు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మద్యం విక్రయాలు

- ప్రభుత్వ నిబంధనలకు పాతర

వర్ధన్నపేట : మండలంలో మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఎన్నికల సమయంలోనే కాకుండా గాంధీ జయంతి, ఇతర సందర్భాల్లోనూ నిబంధనలకు పాతర వేస్తున్నట్టు తెలుస్తోంది. షాపులకు ముందు నుంచి సీలు ఉంటుండగా అధికారులు సీటు వేసే సరికే మద్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయాలు చేపడుతున్నారని సమాచారం. వర్ధన్నపేట పరిధిలో నాలుగు మద్యం షాపులు, పట్టణంలో రెండు బార్లు ఉన్నాయి.

అధిక ధరకు విక్రయాలు

మద్యం షాపుల్లో ఎమ్మార్పీ మీద 5 నుంచి 10 శాతం అధిక ధరకు విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. పట్టణంలో సుమారు 50కిపైగా, గ్రామాల్లోనూ 5–10 చొప్పున బెల్ట్‌షాపులున్నట్టు సమాచారం. మద్యం షాపుల్లో, బెల్ట్ షాపుల్లో ఏ సమయంలో వెళ్లినా మందు దొరుకుతోందని తెలుస్తోంది. అధిక ధరలపై మద్యం షాపుల నిర్వాహకులను ప్రశ్నిస్తే ఎక్సైజ్ శాఖ అధికారులకు ప్రతినెలా మామూళ్లు ఇస్తున్నామని, ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ సమాధానం వస్తోందని సమాచారం.

నకిలీ మద్యం విక్రయాలు..?

మద్యం షాపుల్లో నకిలీ మద్యం విక్రయిస్తున్నట్లు అనుమానాలున్నాయి. ఎక్కువ ధర పలికే మద్యం సీసాల్లో తక్కువ ధర కలిగిన మద్యం కొంత పోసి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. అధిక ధరకు నాసిరకం మద్యం విక్రయిస్తున్నారని విమర్శలున్నాయి.

బార్లలో నిబంధనలకు పాతర

బార్ అండ్ రెస్టారెంట్‌లో కూర్చుని మద్యం సేవించే, 10–20 శాతం అధిక ధరకు విక్రయించేలా, మద్యం బయటకు అవకాశం కల్పించడంతో బార్ అండ్ రెస్టారెంట్లలోనూ బెల్ట్‌షాపులకు ఎమ్మార్పీకి మించిన ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. మద్యం షాపులతోపాటు బార్ షాపులు సైతం బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తుండడంతో పల్లెలోనూ ఏ సమయంలోనైనా మద్యం లభిస్తోంది.

ఎక్సైజ్ అధికారుల తీరుపై ప్రజావాణిలో ఎంఆర్‌పీఎస్ ఫిర్యాదు

ఎక్సైజ్ శాఖ అధికారుల తీరుపై తాజాగా సోమవారం నాడు ప్రజావాణిలో కలెక్టర్ సత్యశారదకు ఎంఆర్‌పీఎస్ నాయకులు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. బెల్ట్‌షాపుల్లోనూ వసూళ్లకు పాల్పడుతున్నారని, గంజాయి స్మగ్లర్లతో కుమ్మక్కయ్యారని, తదితర ఆరోపణలు చేశారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

విచారణ చేస్తాం

పట్టణంలో మద్యం విక్రయాల్లో కల్తీ జరుగుతోందనేది ఆరోపణ మాత్రమే. అలాంటిది ఏదైనా ఉంటే విచారణ చేపట్టి చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. గంజాయి విక్రయాలపైనా ప్రత్యేక దృష్టి సారించాము. ఏవైనా షాపుల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే మా దృష్టికి తీసుకురావాలి.

–స్వరూప, ఎక్సైజ్ సీఐ

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి

నెక్కొండ : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చంద్రుగొండ చెరువు వద్ద తన సొంత డబ్బుతో చేపట్టిన బతుకమ్మ విగ్రహ ఏర్పాటు పనులను ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. అనంతరం మండలంలోని రెడ్లవాడ శివారు పిట్టకాలుబోర్డు తండా పంచాయతీ పరిధిలో రూ.4 లక్షల సీడీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, బక్కి అశోక్, మాజీ జెడ్పీటీసీ బక్కి కవిత, ఓబీసీ సెల జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, మాజీ ఎంపీటీసీలు రవినాయక్, వినయకుమారి, నాయకులు కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, దూదిమెట్ల కొమురయ్య, రాజు, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న రంజిత్‌రెడ్డి

రైతుకు నోటీస్, గ్రీన్ నెట్ ఏర్పాటు



చెన్నారావుపేట : మండలంలోని అమృతండాకు వెళ్లే సీసీ రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావితో ప్రాణాప్రాయం పొంచి ఉందంటూ 'అటెన్షన్ ప్లీజ్' శీర్షికతో ఈనెల 30న 'సాక్షి' ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎర్రబెల్లి శ్యామ్ సోమవారం నాడు సదరు రైతుకు నోటీసు అందించారు. తాత్కాలికంగా బావికి గ్రీన్ నెట్ ఏర్పాటు చేశారు. త్వరలో రక్షణ గోడ కట్టాలని రైతుకు స్పష్టం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

పారిశుద్ధ్య కార్మికులకు వైద్యపరీక్షలు



నర్సంపేట రూరల్ : పరీక్షలు చేస్తున్న వైద్యులు

గీసుకొండ : స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులు, మల్టీపర్పస్ వర్కర్లతోపాటు పరిషత్, రెవెన్యూ కార్యాలయాల సిబ్బందికి సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీఓ కమలాకర్, మండల వైద్యాధికారి డాక్టర్ దేవేందర్, ఎంపీఓ ప్రభాకర్, హెల్త్ సూపర్‌వైజర్ కిరణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో మల్టీపర్పస్ వర్కర్లకు, వారి కుటుంబాలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ క్యాంప్‌ను డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రకాశ్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషన్, భాంజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి వైద్యాధికారి అరుణ్‌చంద్ర, ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు ప్రారంభించారు. క్యాంప్‌లో 168 మంది పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



నెక్కొండ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్ స్థాయి పోటీల్లో స్థానిక తెలంగాణ గురుకుల పాఠశాల/కళాశాలకు చెందిన 19 మంది విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ మమత తెలిపారు. ప్రథమ బహుమతి గెలుచుకున్న విద్యార్థులను గురుకులంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థులు చదువుల్లోనే కాకుండా క్రీడల్లోను రాణించాలని సూచించారు. జోనల్ స్థాయి అండర్–14 విభాగంలో కబడ్డీ, వాలీబాల్ పోటీల్లోనే కాకుండా అండర్–17 విభాగంలోనూ విద్యార్థులు ప్రథమ బహుమతులు సాధించారని తెలిపారు.

వృద్ధుల సంక్షేమం సామాజిక బాధ్యత



నర్సంపేట : వృద్ధులను సన్మానిస్తున్న సీఐ, అసోసియేషన్ సభ్యులు

నర్సంపేట : వృద్ధుల సంక్షేమాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి ఆకాంక్షించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, తెలంగాణ విశ్రాంత ఉద్యోగులు గోక చంద్రయ్య, నాడెం సారయ్య, కీసరి నారాయణరెడ్డి, మాదాసి కట్టయ్య, బోయినపల్లి అండాలమ్మ, అమినాబీలను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి మనోహర్‌రెడ్డి అధ్యక్షత వహించగా సీఐ రమణమూర్తి, టౌన్ ఎస్సై దీలీప్ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఎలాంటి సహాయ సహకారాలు అవసరమున్నా తమను సంప్రదించాలని కోరారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి మాట్లాడారు. నర్సంపేట డివిజన్‌లోని సీనియర్ సిటిజన్స్‌కు ప్రతినెలా ఉచితంగా కంటి పరీక్షలు, శస్త్రచికిత్సలు, వ్యక్తిగత సమస్యల పరిష్కారాలు, వేధింపులకు గురికాకుండా పోలీసులు, సమన్వయం, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. తదనంతరం అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎర్ర జగన్మోహన్‌రెడ్డిని జన్మదినం సందర్భంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి రామారావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరమూర్తి, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

నెక్కొండ : ఆర్థిక ఇబ్బందులు భరించలేక మండల కేంద్రానికి చెందిన ఆటోమొబైల్ షాపు నిర్వాహకుడు, మెకానిక్ కందకట్ల శ్రీనివాస్ (47) ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై మహేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. శ్రీనివాస్ షాపు నిర్వహణకు అప్పులు చేశాడు. వడ్డీ, ఈఎంఐలు కట్టలేక కొద్ది రోజులుగా మనస్తాపానికి గురవుతున్నాడు. ఈనెల 29న రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

శుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ

రాయపర్తి : వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తేనే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోగలమని మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) కూచన ప్రకాశ్ తెలిపారు. మండలంలోని తిర్మలాయపల్లి కేజీబీవీలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీఓ ప్రకాశ్ మాట్లాడారు. విద్యార్థులు శుభ్రత పాటించాలని చెప్పారు.

నాణ్యమైన భోజనం అందించాలి

చెన్నారావుపేట : విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ సరళ కోరారు. మండలంలోని పాపయ్యపేటలోని గుడ్‌షఫర్డ్, ప్రాథమిక పాఠశాల, హైస్కూల్‌లను సోమవారం ఆమె సందర్శించారు. గుడ్‌షఫర్డ్ స్కూల్‌లో గుర్తింపు పత్రాలను, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఎంఆర్‌సీ కార్యాలయంలో యూ డైస్ ఫార్మాట్ అందజేయాలని చెప్పారు. ఫార్మటివ్ అసెస్‌మెంట్–1, 2 ఫలితాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

ఆర్టీసీ బస్సును నడిపించండి

చెన్నారావుపేట : మండలంలోని ఎల్లాయగూడెంకు ఆర్టీసీ బస్సు నడిపించాలని మాజీ ఎంపీటీసీ రమాబాయి రాథోడ్ కోరారు. ఈ మేరకు ఆమె ఆధ్వర్యంలో డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. నర్సంపేట నుంచి జల్లి, ఎల్లాయగూడెం మీదుగా చెరువుకొమ్ముతండా, మాణిక్యంతండా, 16 చింతల్ తండా వరకు బస్సు నడిపించాలని కోరారు.

మంచినీళ్ల చెరువును కాపాడాలి

రాయపర్తి : మండల కేంద్రంలోని మంచినీళ్ల చెరువును శ్రీ సత్యనారాయణ ఫౌల్ట్రీ హ్యాచరీస్ బారి నుంచి కాపాడాలని కోరుతూ జిల్లా కలెక్టర్ సత్యశారదకు సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పరిరక్షణ కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. హ్యాచరీలోని కెమికల్ వ్యర్థాలు చెరువులోకి చేరి చేపలతోపాటు తాగునీరు కలుషితం అవుతున్నట్టు తెలిపారు.

'స్థానిక' ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం

దుగ్గొండి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం ఇస్తామని బీజేపీ జిల్లా కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రేబల్లెకు చెందిన దరుగుల రాము, తిక్క ప్రవీణ్, గీసపాక చిరంజీవి, కత్తి సాంబయ్య, కత్తి లోకేశ్ ఆ పార్టీలో సోమవారం చేరగా వారిని రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. భవిష్యత్ రాజకీయాలన్నీ యువత చేతిలోనే ఉంటాయని చెప్పారు. యువత రాజకీయాల్లోకి రావాలని సూచించారు. ప్రధాని మోదీ పాలనతో భారత్ ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందని చెప్పారు. గ్రామాల్లో పార్టీని బలోపేతం చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నేదురు రాజేందర్, ప్రధాన కార్యదర్శి మోకిడె ప్రభాకర్, నాయకులు చెల్పూరి రాజు, పులిచేరు రమేశ్, రాజు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు గుర్తించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

పర్వతగిరి : ఉపాధి హామీ పథకంలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులను గుర్తించాలని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లను ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్ ప్రకారం అన్ని గ్రామాల్లో అక్టోబర్ 2న సభలు నిర్వహించాలని చెప్పారు. గ్రామానికి అవసరం ఉన్న వాటిని గుర్తించాలని సూచించారు. డిమాండ్ ప్రకారం నర్సరీల్లో మొక్కలు పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ సుశీల్‌కుమార్, ఈసీ రాజు, క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు రుణమాఫీ వర్తించేలా చర్యలు

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ : అర్హులందరికీ రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకుంటామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఊకల్ రైతు సేవా సహకార సంఘం (సొసైటీ) 40వ మహాజన సభ సోమవారం నిర్వహించగా అధ్యక్షుడు బొమ్మల రమేశ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. త్వరలో డీసీఓ, ఇతర అధికారులతో సొసైటీ పాలకవర్గ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. రుణమాఫీ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. వడ్డీ రేటు తగ్గింపుపై తీర్మానం చేసి ఆర్‌బీఐకి పంపించాలని సూచించారు. తొలుత సొసైటీ అధికారులు వివరాలు వెల్లడించారు. సొసైటీలో వివిధ కారణాలతో 1221 మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. పలువురు రైతులు గోడు వెళ్లబోసుకున్నారు. పట్టా పుస్తకం, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, తదితర సమస్యలతో అర్హులైనప్పటికీ తమకు రుణమాఫీ చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. వాణిజ్య బ్యాంకులు పంట రుణాలకు 7 శాతం వడ్డీ వసూలు చేస్తుండగా ఊకల్ సొసైటీలో 12 శాతం వసూలు చేస్తున్నట్టు తెలిపారు. అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని, పంట రుణాల వడ్డీ రేటు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఓ నీరజ, సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎల్.రామకృష్ణారావు, సీఈఓ రమేశ్, ఏఓ హరిప్రసాద్‌బాబు, వైస్ చైర్మన్ మున్నంగి జనార్దన్, డైరెక్టర్లు వీరస్వామి, రాజ్‌కుమార్, వెంకట్‌రావు, రజిత, లక్ష్మి, పాపయ్య, రవి, రైతు సంఘాల నాయకులు చందర్‌రావు, శ్రీనివాస్, గోనె కొమారస్వామి పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే మెరుగైన ఫలితాలు

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



క్వశ్చన్ బ్యాంక్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

ఖానాపురం : విద్యార్థులు పట్టుదలతో చదివితే మెరుగైన ఫలితాలు సాధించడం ఖాయమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు నర్సంపేటకు చెందిన గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు సమకూర్చిన రూ.2 లక్షల విలువైన క్వశ్చన్ బ్యాంక్‌లను ఎమ్మెల్యే మాధవరెడ్డి సోమవారం పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని సూచించారు. గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ సుబ్బారావును ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యద్ల జగన్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల లక్ష్యం



సమావేశంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మామునూరు ఏసీపీ తిరుపతి

గీసుకొండ : శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల లక్ష్యమని మామునూరు ఏసీపీ తిరుపతి తెలిపారు. గ్రేటర్ వరంగల్ నగరంలోని 15వ డివిజన్ పరిధిలోని గొర్రెకుంటలో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పోలీసు బలగాలతో నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. ప్రజలు గంజాయి, గుట్కా, గుడుంబా, తదితర వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజల్లో పోలీసుల పట్ల స్నేహభావం పెంపొందించేలా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామంలో తనిఖీలు చేపట్టి ప్రభుత్వ అనుమతి లేకుండా రాతిపెల్లి సాగర్, పొగాకు సమ్మయ్య, నోముల నర్సింహస్వామి నిల్వ చేసిన రూ.24,500 విలువైన మద్యంతోపాటు సరైన పత్రాలు లేని 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గీసుకొండ, పర్వతగిరి, మామునూరు, ఏనుమాముల ఇన్‌స్పెక్టర్లు బాబూలాల్, రాజగోపాల్, రవికుమార్, రాఘవేందర్, ఎస్ఐలు షేక్ జానీపాషా, కుమార్, ప్రవీణ్‌కుమార్, శ్రీను, కృష్ణవేణితోపాటు మామునూరు సబ్ డివిజన్ పరిధిలోని సుమారు 40 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాల అభివృద్ధే ధ్యేయం

- ఏఎంఓ సుజన్‌తేజ



పరీక్షను పరిశీలిస్తున్న ఏఎంఓ సుజన్ తేజ

గీసుకొండ : విద్యార్థుల విద్యాసామర్థ్యాల అభివృద్ధే ధ్యేయంగా నేషనల్ అచీఫ్‌మెంట్ సర్వే పరీక్షలు నిర్వహించనున్నట్టు విద్యాశాఖ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ) సుజన్‌తేజ తెలిపారు. మండలంలోని వంచనగిరి మోడల్ స్కూల్, కేజీబీవీ, శాయంపేట జెడ్పీ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 3, 6, 9వ తరగతుల విద్యార్థులకు సోమవారం నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే మోడల్ పరీక్షలను ఆయన పరిశీలించి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఏఎంఓ మాట్లాడారు. డిసెంబర్ 4న దేశవ్యాప్తంగా పరీక్షలు నిర్వహించనుండగా అందుకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయడానికి ప్రభుత్వ పాఠశాలల్లో మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హిమబిందు, హెచ్ఎంలు సంపత్‌రావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వివాదాస్పద భూమిలో విచారణ

నెక్కొండ : మండల కేంద్రంలోని హన్మాన్ బజార్‌లోని వివాదస్పద భూమిని అధికారులు సోమవారం సందర్శించి విచారణ చేపట్టారు. ఆర్ఐ నరేందర్, పంచాయతీ కార్యదర్శి సదానందం స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం పట్టణ నాయకులు కొమ్ము రమేశ్ యాదవ్, దేవనబోయిన వీరభద్రయ్య మాట్లాడారు. కొందరు దురుద్దేశ్యంతోనే భూమి కబ్జా చేశామని అసత్య ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

నెక్కొండ : మండలంలోని బంజరుపల్లిలో సోమవారం పోలీసులు ఆటోలో తరలిస్తున్న 3 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్టు ఎస్సై మహేందర్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని గాజులగట్టు శివారు సోమలతండాకు చెందిన వాంకుడోతు అజయ్ బియ్యం దందాకు పాల్పడుతుండగా కేసు నమోదు చేసిచ ఆటో, బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.


'ఎమ్మెల్యే నాగరాజు రాజీనామా చేయాలి'

వర్ధన్నపేట : స్థానిక ఎమ్మెల్యే నాగరాజు మాదిగలకు క్షమాపణ చెప్పడంతోపాటు పదవికి రాజీనామా చేయాలని మాదిగ జేఏసీ, రాజకీయ పార్టీల నాయకులు, మాదిగ యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. పట్టణంలో మాదిగ జేఏసీ, బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ, ఆర్ఎస్‌పీ, డీఎస్‌పీ, ప్రజా పార్టీ, అంబేడ్కర్, సంఘం, మాదిగ యువజన సంఘాల ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు సోమవారం భారీ నిరసనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎంఎంఆర్ ఫంక్షన్ హాలులోజేఏసీ నాయకులు రవీందర్, కుమారస్వామి, సత్య తదితరులు మాట్లాడారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

చెన్నారావుపేట : గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ శ్రీవాణి కోరారు. మండలంలోని అక్కల్‌చెడ గ్రామాన్ని ఆమె సందర్శించి పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. సర్వే నిర్వహించి గ్రామంలో వసతులు కల్పిస్తామని చెప్పారు.

బియ్యం సాయం



రాయపర్తి : మండలంలోని పెర్కవేడు, గన్నారం గ్రామాలకు చెందిన ధర్మారపు మణికంఠ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పంపించిన బియ్యం, నిత్యావసర సరుకులను ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలను శ్రీనివాస్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. కార్యక్రమాల్లో వల్లాల సుధాకర్, కుక్కల రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలి

నర్సంపేట రూరల్ : గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి కోరారు. నర్సంపేట మండలంలోని గురిజాల–1 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన పోషణ మాసోత్సవాన్ని ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు వయస్సున్న చిన్నారులు పోషకాహారం తీసుకోవాలని సూచించారు.

వదంతులు నమ్మొద్దు

చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామంలో ఓ రాజకీయ నాయకుడు గడ్డి మందు పిచికారీ చేయించినట్లు వచ్చిన వదంతులు నమ్మొద్దని పంచాయతీ కార్యదర్శి మహేశ్ కోరారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బాదావత్ బాలు, నాయకులు మహేశ్‌ను నిలదీశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గడ్డి మందు పిచికారీ చేస్తే ఓ నాయకుడి ఆదేశాల మేరకు పిచికారీ చేసినట్లు వాట్సాప్ గ్రూప్‌లో ఎలా పెడతారని ప్రశ్నించారు. అనంతరం సమస్యను ఎంపీడీఓ శ్రీవాణి, ఎంపీఓ శ్రీధర్ రాజు దృష్టికి తీసుకెళ్లారు.